
క్లుప్తంగా

ప్రమాదవశాత్తు దుబ్బగుట్టకు నిప్పు



దుబ్బగుట్ట వద్ద వ్యాపిస్తున్న మంటలు

ఆమనగల్లు: పట్టణ సమీపంలోని దుబ్బగుట్టకు శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆమనగల్లు సమీపంలోని దుబ్బగుట్ట క్రింద ప్రమాదవశాత్తు మంటలు ప్రారంభమై గుట్టపైకి విస్తరించాయి. సమాచారం అందుకున్న ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాం అక్కడికి చేరుకొని వెంటనే కల్వకుర్తి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం చేరవేశారు. దీంతో వెంటనే సంఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు.

ఇబ్రహీంపట్నం ప్రత్యేకాధికారిగా సుకీర్తి

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండల ప్రత్యేకాధికారిగా మత్స్యశాఖలో పనిచేస్తున్న ఏడీ సుకీర్తిని జిల్లా కలెక్టర్ శశాంక నియమించారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల ప్రత్యేకాధికారిగా సుకీర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో ఎలాంటి నీటి ఎద్దడి ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ విషయంలో ప్రత్యేకాధికారులు చొరవ చూపాలని, గ్రామాల్లో పర్యటించాలని కోరారు.

న్యాయం చేయాలని ఆందోళన

మాడ్గుల: అన్నబోయిన్ పల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో న్యాయం చేయాలని కోరుతూ మృతుని కుటుంబ సభ్యులు శనివారం ఆందోళన చేశారు. నాగార్జున సాగార్ రహదారిపై మాడ్గుల మండలం అన్నబోయిన్ పల్లి గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ యాదయ్య మృతి చెందాడు. ఈ విషయంలో తమకు అనుమానాలు ఉన్నట్లు భార్య శారద మాడ్గుల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులో పేర్కొన్నారు. అన్నబోయిన్ పల్లికి చెందిన నరోత్తం రెడ్డి ఇంటికొచ్చి తీసుకెళ్లాడని అనంతరం మృతి చెందినట్లు సమాచారం వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్త మృతిపై విచారణ జరిపించి న్యాయం చేయాలని శారద తెలిపారు. ఈ విషయంలో మాడ్గుల సీఐ వివరణ కోరగా ఫిర్యాదు అందిందని దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్

యాచారం: రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ తెలియజేశారు. చింతపట్ల గ్రామంలో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ రకం క్వింటాల్ ధాన్యానికి రూ. 2,203, సాధారణ రకం ధాన్యం క్వింటాల్‌కు 2,183గా నిర్ణయించారన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మంచి ధరను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహ స్వామికి ప్రత్యేక పూజలు

తుక్కుగూడ: జిన్నాయిగుట్ట లక్ష్మీనరిసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం భక్తులు స్వామి వారిని పెద్ద ఎత్తున దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు మురళీశర్మ, అజయ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు తప్పక వినియోగించుకోవాలి

పహాడీషరీఫ్: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎలక్షన్-2024 స్వీప్ కార్యాక్రమంలో భాగంగా 'ఐ ఓటు ఫర్ ష్యూర్' అనే నినాదంతో శనివారం మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో శానిటేషన్, మెప్మా సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఓటు తోనే మన పాలకులను మనమే నిర్ణయించుకునే శక్తి ఉందన్నారు. అవినీతిరహిత ప్రజా ప్రతినిధులను ఎన్నుకున్నప్పుడే దేశం అన్ని రంగాల్లో ముందుకెళ్తుందన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుంది. మరోవైపు నీటి కొరత ఏర్పడుతూనే ఉంది. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా పడకపోవడంతో రానున్న కాలంలో సమస్య ఏర్పడవచ్చని పలువురు చెబుతున్నారు. ఈ క్రమంలో అక్కడక్కడ పైప్‌లైన్ లీకేజీ, నీటిసరఫరాలో అంతరాయం తదితర సమస్యలను పరిగణనలోకి తీసుకుంటే సమస్య ఉత్పన్నానికి దగ్గరగానే ఉన్నట్టు అనిపిస్తుంది. కానీ నీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకోబోయే చర్యలదృష్ట్యా మున్సిపల్ కమిషనర్ బి సత్యనారాయణ రెడ్డి 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.



బి సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్

తుర్కయంజాల్: వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా జలమండలి అధికారులతో కలిసి పని చేయనున్నామని, ఇప్పటికే దీనిపై ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ కమిషనర్ బి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. మున్సిపల్ సిబ్బంది ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని, ఆయా పనుల కోసం కార్యాలయాలకు వచ్చే వారిని ఇబ్బందులకు గురిచేయొద్దన్నారు.

ప్రశ్న: పారిశుద్ధ్యంపై మీ ఫోకస్ ఏంటీ ?

కమిషనర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డు పరిశుభ్రంగా ఉండేలా ఇప్పటికే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఎక్కువ మంది సిబ్బందిని ఒకే వార్డులో నియమించి పరిసరాలను శుభ్రం చేయిస్తున్నాం. ఇళ్ల నుంచి వెలువడే చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా, చెత్తను సేకరించే స్వచ్ఛ ఆటోలకు మాత్రమే అందజేసే విధంగా అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే జరిమానా విధిస్తాం. తడి, పొడి చెత్తను ఇళ్ల నుంచే వేరు చేసి అందజేయాలి.

ప్రశ్న: అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఎలా వేస్తారు?

కమిషనర్: క్రమబద్ధమైన నగరం రూపొందాలంటే నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలి. రోడ్డు సెట్ బ్యాక్ జరగకుండా నిర్మాణాలు చేపడితే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. ఇలాంటి వాటి విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది, మార్పు ఎలా తీసుకొస్తారు?

కమిషనర్: వీధి దీపాల నిర్వహణ ఇఇఎస్ఎల్ అనే సంస్థ ఇన్ని రోజుల పాటు నిర్వహించేది. వీరి పని తీరు సరిగ్గా లేకపోవడంతో సమస్యలు వస్తున్న మాట వాస్తవమే. దీన్ని పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ఇప్పటికే ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ ఆదేశాల మేరకు పాలకవర్గం అనుమతితో సీడీఎంఏకు లేఖ రాశాము. త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుంది.

ప్రశ్న: ప్రజలకు మీరిచ్చే సందేశం ఏంటీ?

కమిషనర్: ఏ మున్సిపాలిటీ అయినా అభివృద్ధి చెందాలంటే ముందుగా పన్నుల వసూలు కీలకం. ఈ నెల 30వ తేదీ వరకు 2024-25 ఆర్థిక సంవత్సరం పన్నును ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ వస్తుంది. ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్‌ను వినియోగించొద్దు. మున్సిపాలిటీ వార్డు కేంద్రాల్లోని రీసైకిల్, రీ యూజ్, రెడ్యూజ్ కేంద్రాలను వినియోగించుకోవాలి.

సమస్యలు పరిష్కరించండి

మండల ప్రత్యేకాధికారి శాంతిశ్రీ



మాట్లాడుతున్న శాంతిశ్రీ

మంచాల: గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి శాంతిశ్రీ పేర్కొన్నారు. శనివారం మంచాల మండల కార్యాలయంలో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఎక్కువగా తాగు నీటి ఇబ్బందులు తలెత్తే గ్రామాలను గుర్తించాలన్నారు. గ్రామాల్లో పైపు లైన్ లీకేజీలు, గేట్ వాల్వ్, మోటార్ల మరమ్మతులు ఉంటే తక్షణమే చేయించాలన్నారు. తాగు నీటి సమస్య జఠిలమైన గ్రామాల్లో వ్యవసాయ బోర్లు లీజుకు తీసుకొని నీటిని సరఫరా చేస్తామన్నారు. తాగు నీటి సమస్య ఉన్నట్‌లెత్తై 9347492260పై సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బాలశంకర్, ఎంపీఓ తేజ్ సింగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటాపూర్‌కు చెందిన భాషమోని రామస్వామి అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. శనివారం విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం రూ. 3వేలు సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేశ్ యాదవ్, అంజన్‌రెడ్డి, రాములయ్య, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: శెట్టిపల్లి గ్రామానికి చెందిన కనకమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. శనివారం విషయం తెలుసుకున్న శెట్టిపల్లి మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన రూ.5వేలు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు కృషి



మాట్లాడుతున్న తహసీల్దార్ అయ్యప్ప

యాచారం తహసీల్దార్ అయ్యప్ప

యాచారం: లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలని యాచారం తహసీల్దార్ అయ్యప్ప పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం పోలింగ్ నిర్వాహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నింబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ నమోదులో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌లో ఓటేసి మళ్లీ సాధారణ లైనులో ఉండి ఓటేసే అవకాశం ఉంటుందన్నారు. ఇలాంటి పొరపాట్లను సరిదిద్దాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి: ప్రభుత్వ నిబంధనల కనుగుణంగా ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ కెవి రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికల నిమిత్తం ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో పాటు, మాస్టర్ ట్రైయినర్‌తో ఎన్నికలు ఏవిధంగా నిర్వహించాలని, ఫామ్-12 పోస్టల్ బ్యాలెట్ గురించి వివరించారు. అనంతరం పూర్తి చేసిన ఫామ్-12 పోస్టల్ బ్యాలెట్ పత్రాలను ఉద్యోగుల నుంచి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీటీ సంతోశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



తలకొండపల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ రంగారెడ్డి

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- తుక్కుగూడ జనజాతర సభకు తరలిన నాయకులు

ఆమనగల్లు: కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 14కు పైగా స్థానాల్లో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి జనజాతరకు తరలుతున్న వాహన శ్రేణిని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుక్కుగుడలో జరిగే జనజాతరకు కల్వకుర్తి నియోజక వర్గం నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల: తెలంగాణలో మార్పు మొదలై ప్రజాపాలన కొనసాగుతుందని, అదేవిధంగా దేశంలో మార్పు కోసం పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తుక్కుగూడలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ జన జాతర సభకు మండలం నుంచి వివిధ గ్రామాల నుంచి కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కొండల్ రెడ్డి, సాయిరెడ్డి, మిద్దె రాములు, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మండల కేంద్రంతో పాటు, దేవుని పడకల్, చుక్కాపూర్, తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ యాదయ్య, రంగారెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం, కృష్ణ, శ్రీను, జంగయ్య, రాజు, లింగం, నాగరాజు, మహేష్, కృష్ణయ్య, మురారి, వెంకటయ్య, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.



మాడ్గుల నుంచి జన జాతర సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



తలకొండపల్లి: దేవుని పడకల్ నుంచి తరలుతున్న నాయకులు

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

నియోజక వర్గంలోని పలు మండలాలు, గ్రామాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. మంచాలలో మండల అధ్యక్షుడు పొండాల జంగయ్య గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె భాషయ్య, పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టిఫిన్ బైఠక్‌ను నిర్వహించారు. యాచారం గ్రామంలో దళిత మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు భాషా, ఎంపీపీ కొప్పు సుకన్య, మొండిగౌరెల్లి గ్రామంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్ పాల్గొన్నారు.



యాచారం: జెండావిష్కరణలో దళిత మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు భాషా తదితరులు



మంచాల: చిత్తాపూర్‌లో పాల్గొన జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె భాషయ్య



కడ్తాల్: ఆవిర్భావ దినోత్సవంలో గిరిజన మోర్చ అధ్యక్షుడు సాయిలాల్‌నాయక్



తలకొండపల్లి: జెండ ఎగురవేస్తున్న మాజీ సర్పంచ్ బక్కి కుమార్ తదితరులు



ఇబ్రహీంపట్నం రూరల్: బొంగ్లూర్ చౌరస్తాలో జెండావిష్కరిస్తున్న నాయకులు



మాడ్గుల: ఇర్విన్ గ్రామంలో ఆవిర్భావ వేడుకల్లో బీజేపి నాయకులు



ఆమనగల్లు: పోలెపల్లిలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

హామీల అమలులో నిర్లక్ష్యం

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్
- ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ నేతల ఆందోళన

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా మరియు రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం కందుకూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతులను అవమానించేలా రైతు బంధు విడుదల చేయకుండా జాప్యం చేస్తుందన్నారు. ఇష్టానుసారంగా కరెంట్ కోతలు విధిస్తున్నారని, పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ ఎక్కడని? రూ.2 లక్షల రుణమాఫీ ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. నాణ్యమైన 24 గంటల కరెంట్ ఇవ్వకపోవడంతో పంటలు ఎండి, అప్పులు తీర్చలేక రైతులు ఇప్పటికే 209 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మహత్యలు చేసుకున్న ప్రతీ రైతు కుటుంబానికి రూ.5లక్షల చొప్పున, అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్ రెడ్డి, పార్టీ మహిళా అధ్యక్షురాలు ఇందిరాదేవేందర్, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.లచ్చానాయక్, ఎంపీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గోపాల్‌రెడ్డి, గణేశ్, జంగయ్య, సీనియర్ నాయకులు కాకి దశరథ, ప్రకాశ్‌రెడ్డి అశోక్, దామోదర్‌గౌడ్, బాబయ్య, దేవేందర్‌గౌడ్, రాములు, నర్సింహ, దేవేందర్, పాండురంగారెడ్డి, పారిజాతం, దర్శన్‌రెడ్డి, కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, ఉన్ని వెంకటయ్య, కొండల్‌రెడ్డి, వెంకటేశ్, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జోరుగా ఇఫ్తార్ విందులు

పహాడీషరీఫ్: రంజాన్ పండుగ సమీపిస్తుండడంతో ఇఫ్తార్ విందులు ఊపందుకున్నాయి. పార్లమెంట్ ఎన్నికల సమయం కావడంతో ప్రజా ప్రతినిధులు సైతం ముస్లింలకు ప్రత్యేకంగా ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే రంజాన్ చివరి శుక్రవారం(జుమ్మాతుల్ విదా) రాత్రి జల్‌పల్లి మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేశారు. పహాడీషరీఫ్‌లోని ప్రీమియర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విందులో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాధి పాల్గొన్నారు. పహాడీషరీఫ్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు మహమూద్ ఇచ్చిన విందులో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఆమె తనయుడు కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు. జల్‌పల్లిలో మాజీ ఉప సర్పంచ్ షేక్ జహంగీరుద్దీన్ ఇచ్చిన విందులో కేఎల్ఆర్‌తో పాటు పార్టీ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్ బుడుమాల యాదగిరి, మన్న రవికుమార్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌లో ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే టీకేఆర్ తదితరులను సన్మానిస్తున్న ముస్లింలు